
సాక్షి
వికారాబాద్
7
ఆదివారం । 30 । మార్చి । 2025



ఎండుతున్న పంటలు
పెద్దేముల్ మండలం బండపల్లి గ్రామంలో బోర్లలో నీరు అడుగంటి వరి పంట ఎండుముఖం పడుతోంది.
8లో▸



చెల్లి దగ్గరకు వచ్చి..
బతుకుదెరువు కోసం చెల్లీబావ వద్దకు వచ్చాడు. దొరికిన రోజు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించాడు.
8లో▸



న్యూస్‌రీల్

ఉగాది శుభాకాంక్షలు
స్పీకర్ ప్రసాద్‌కుమార్

అనంతగిరి: జిల్లా ప్రజలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ శనివారం ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండి రైతులు ఆనందంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఈ ఏడాది ప్రజలకు మరింత సమర్థవంతంగా సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు.

ఇఫ్తార్ విందులో..



ముస్లింలతో కలిసి ప్రార్థన చేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

రంజాన్ పండుగ సందర్భంగా వికారాబాద్‌లోని సత్యభారతి గార్డెన్‌లో శనివారం ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సుధీర్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మైనార్టీ నాయకులు తస్వర్ అలీ, ఎండీ హఫీజ్, వహీద్‌మియా, తహసీల్దార్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలి
శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డికి పండు తినిపిస్తున్న నాయకుడు అబ్దుల్ రవూఫ్

తాండూరు: రంజాన్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. శనివారం తాండూరు ఈద్గా ఖబ్రస్థాన్ కమిటీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముస్లిం మత పెద్దలతో కలిసి ఇఫ్తార్ విందు స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కమల్ అత్తర్, మత పెద్దలు షరీఫ్‌ఖాన్, యూసుఫ్‌ఖాన్, నాయకులు అబ్దుల్ రవూఫ్, ముస్తాఫా పటేల్, బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నయీమ్, నాయకులు కరణం పురుషోత్తంరావు, రవీందర్, రఘు, అడ్వకేట్ ఫరీద్ పాల్గొన్నారు.

అంటరానితనాన్ని రూపుమాపాలి

మర్పల్లి: సమాజంలో అంటరానితనాన్ని పూర్తిగా రూపుమాపాలని సిరిపురం బాలుర ఎస్సీ వసతి గృహం వార్డెన్ జీ తుల్జారాంగౌడ్ అన్నారు. శనివారం మండలంలోని మొగిలిగుండ్ల గ్రామంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలసి మెలసి ఉండాలన్నారు. చదువుకున్న వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను బాగా చదివించాలని సూచించారు.

విశ్వావసు.. శుభశ్రేయస్సు

కొత్త సంవత్సరానికి నేడు నాంది

- తెలుగు వారి తొలి పండుగ ఉగాది
- షడ్రుచులతో పచ్చడి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు.. పంచాంగ పఠనానికి ఏర్పాట్లు

తాండూరు: ఎన్నో తీపి గుర్తులు.. మరెన్నో జ్ఞాపకాలతో క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కోటి ఆశలతో విశ్వావసు నామ సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికే శుభ సమయాన 'సాక్షి' ప్రత్యేక కథనం.. ఉగాది అంటేనే షడ్రుచుల మేళవింపు.. తెలుగువారి తొలి పండుగ.. ఈ రోజు ఏ పని తలపెట్టినా అంతా శుభమే కలుగుతుందని జనం విశ్వాసం.. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించడం.. పంచాగ శ్రవణం చేయ డం ఆనవాయితీగా వస్తోంది.. దశాబ్దాల కాలంగా కొంతమంది వేద పండితులు పంచాంగ పఠనం చేస్తూ తమదైన ముద్ర వేస్తున్నారు.. నేడు చైత్ర శుద్ధ పాఢ్యమి రోజున సూర్యమానం ప్రకారం ఉగాది ప్రారంభమవుతుంది. తెల్లవా రుజామున కోడి కూతతో పండుగ సందడి మొదలవుతుంది. రైతులు ఈ పండుగ ఆధారంగానే సాగు పనులు ప్రారంభిస్తారు. పూజలు చేసి ఖరీఫ్ పనులను మొదలుపెడతారు. పొలంలో అరక కట్టి పూజలు చేసి నైవేద్యం సమర్పించి, పొలాన్ని దుక్కి దున్నుతారు. పనిముట్లకు పూజలు చేస్తారు. ఎద్దులకు ముక్కుతాడు వేస్తారు.

పండగ ప్రాముఖ్యత

యుగాది అనేది సంస్కృత పదం.. యుగాది అంటే యుగానికి ఆది అని పురాణాలు చెబుతున్నాయి. ఏటా చైత్ర శుద్ధ పాఢ్యమి రోజున ఉగాది పండుగను జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది. ఈ పండుగను ఎందుకు జరుపుకొంటారు అనే దానిపై ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. బ్రహ్మ సృష్టిని ఉగాది రోజునే సృష్టించారని.. సృష్టి ప్రారంభమైన రోజు కాబట్టే ఆ రోజును ఉగాదిగా జరుపుకొంటారని పురాణ గాథ లు చెబుతున్నాయి. శాలివాహనుడు పట్టాభిషేకం చేసుకున్న రోజున ఉగాది జరుపుకొంటారని మరో గాథ ప్రచారంలో ఉంది. అంతేకాకుండా వసంత రుతువు ప్రారంభం సందర్భంగా ఉగాదిని జరుపుకొంటారని, ఈ రుతువులో చెట్లకు కొత్త చిగురు వస్తుండటంతో కొత్త జీవనానికి నాందిగా పండుగను జరుపుకొంటారు.

షడ్రుచుల ఉగాది పచ్చడి

తెలుగు సంవత్సరాది ఉగాది పండుగ రోజు ప్రతి ఇంట్లో పచ్చడి తయారు చేసి సేవిస్తారు. షడ్రుచులతో తయారు చేసిన పచ్చడిని తెలుగు ప్రజలు ఇష్టంగా తాగుతారు. వేప పువ్వు, మామిడి, చింతపండు, బెల్లం, ఉప్పు, కారంపొడి కలిగిన పచ్చడిని తయారు చేసి తాగుతారు.



తాండూరు మార్కెట్‌లో పండుగ సామగ్రి



తాండూరు పట్టణంలో కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు

పంచాంగ పఠనం

ప్రతిఏటా కొత్త సంవత్సరం ప్రారంభం రోజు వేద పండితులు, పురోహితులు ప్రజలకు పంచాంగం చెబుతారు. మంచి, చెడు, ఆర్థిక ప్రయోజనాలు, కలిగే నష్టాలు, పంటలు, వ్యాపారాలు, పరిశ్రమలు, వృద్ధి రేటు, విద్య, వైద్యం లాంటివి ముందే పంచాంగ శ్రవణం ద్వారా ప్రజలకు వినిపిస్తారు. రాజకీయాలపై జోస్యం చెబుతారు. ప్రజలు పంచాంగ శ్రవణాన్ని విశ్వసిస్తారు. ఆల యాలకు వెళ్లి శ్రద్ధగా వింటారు.

రథ చక్రాలకు పూజలు

ఉగాది పండుగను పురస్కరించుకొని తాండూరు పట్టణంలో వెలసిన శ్రీ భావిగి భద్రేశ్వర ఆలయ జాతర ఏర్పాట్లను ప్రారంభిస్తారు. పండుగ రోజు సాయంత్రం 5 గంటలకు భద్రేశ్వర్ చౌక్ కూడలిలోని రథానికి చక్రాలు బిగించి భక్తుల సమక్షంలో ప్రజాప్రతినిధులు,ఆలయ కమిటీ ప్రతినిధులు పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది.

స్వాగతమో 'విశ్వావసు'



ఉషోదయపు పొద్దులతో
పంచాంగపు పద్దులతో
స్వాగతమో 'విశ్వావసు'
కవిపండిత సుద్దులతో

తీపి, చేదు, వగరు, పులుపు
ఉప్పు, కారములను కలుపు
పచ్చడి బోధించె మనకు
ఐకమత్యముదే గెలుపు

ఐదు వేళ్లు కూడినట్లు
షడ్రుచులే కలిసినట్లు
జీవించడమే ఉగాది
స్వర్గమిలను వెలిసినట్లు

– కవి, రచయిత,
వడిచర్ల సత్యం, తెలుగు
ఉపాధ్యాయుడు, జెడ్పీహెచ్ఎస్ కందనెల్లి

తాతల కాలం నుంచి..



దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌కు చెందిన అనంత సేనాచారి బ్యాంక్ ఉద్యోగం చేసి విరమణ పొందారు. వారి తాత రాఘవేంద్రాచారి, తండ్రి వెంకటాచారీలు చిన్న తనం నుంచే గ్రామంలో ప్రతి ఉగాది పండుగ రోజు పంచాంగం చెప్పేవారు. ప్రస్తుతం సేనాచారి ఆ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దాదాపు 40 ఏళ్ల నుంచి పంచాంగం చెబుతున్నారు.



సంప్రదాయానికి ప్రతీక చీరకట్టు



తాండూరు రూరల్: నేటి ఆధునిక కాలంలో యువతులతో పాటు మహిళలు ప్రాశ్చాత్య సంస్కృతికి అలవాడుపడ్డారు. చీర కట్టుకోవడం మన దేశ సంప్రదాయం. ప్రస్తుతం ఇళ్లలో శుభాకార్యాలు జరిగినప్పుడు మాత్రమే చీరకట్టుకుంటున్నారు. చీర గొప్పతనం తెలుసుకోవడం లేదు. అమ్మమ్మ, నాన్నమ్మ, అమ్మ, అక్కలు చీర కట్టుకోవడం చూస్తున్నాం. చీర కట్టుకోవడమంటే నాకెంతో ఇష్టం. యువతులు చీర కట్టుకోవడంపై మొగ్గుచూపాలి. పండుగల సమయంలో కళాశాలల్లో జరిగే కార్యక్రమాలకు చీరకట్టుకొని వెళ్తా.

– భాగ్యలక్ష్మి, డిగ్రీ విద్యార్థిని, తాండూరు

పాతికేళ్లుగా పంచాంగ పఠనం

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధారూర్ శ్రీనివాసాచార్యులు పాతికేళ్లుగా పంచాంగం చెబుతున్నారు. ప్రతి ఏడాది ఉగాది పండుగ సందర్భంగా ఆస్థానం నిర్వహించి పంచాంగం చదివి వినిపిస్తున్నారు. నేడు(ఆదివారం) విశ్వావసు నామ ఉగాది ప్రారంభం కానుంది. ఈ ఏడాది పంటలు, వర్షాలు, కాలమానం, ప్రజల జీవన విధానం, ప్రకృతి వైపరీత్యాల గురించి వివరిస్తారు. యాదగిరి గుట్టకు చెందిన విశ్రాంత అధ్యాపకుడు ధారూర్ శ్రీనివాసాచార్యులు చాలా కాలం పాటు కొడంగల్‌లో తెలుగు అధ్యాపకుడిగా పని చేశారు. ఈ ప్రాంత ప్రజలకు చిర పరిచితులు.



పంచాంగం చదువుతున్న శ్రీనివాసాచార్యులు(ఫైల్)

పచ్చదనం ఆయన నేస్తం

కొడంగల్‌రూరల్: మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం అంటే ఆయనకు ఎంతో ఆనందం. చెట్లు పచ్చదనంతో కళకళలాడుతుంటే తృప్తి పొందుతాడు. కొడంగల్ మండలం పర్సాపూర్‌కు చెందిన తట్టేపల్లి రాములు హాస్టల్ వార్డెన్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందారు. ఆయన పనిచేసిన వసతి గృహాల వద్ద విరివిగా మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆ మొక్కలు వృక్షాలుగా మారి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రస్తుతం కొడంగల్ పట్టణంలోని లాహోటి కాలనీలో ఉంటున్న ఆయన ఇంటి పరిసరాల్లో సైతం మొక్కలు పెంచుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



పర్సాపూర్‌లో రాములు నాటిన మొక్కలు.. వృక్షాలుగా..



కొడంగల్‌లోని తన ఇంటి ముందు మొక్కలు నాటుతున్న రాములు

కల్ప వృక్ష వాహనంపై శ్రీకృష్ణుడు



కల్ప వృక్ష వాహనంపై విహరిస్తున్న స్వామివారు

కొడంగల్: పద్మావతీ సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి శనివారం ఉదయం కల్ప వృక్ష వాహనంపై శ్రీకృష్ణ పరమాత్ముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుమల తిరుపతి దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలు కొడంగల్‌లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవాయిద్యాలు, గోవింద నామ స్మరణలతో భక్త జనం పులకించారు. మధ్యాహ్నం రెండు గంటలకు ఉత్సవ మూర్తులకు అభిషేకం జరిపించారు. శనివారం అమావాస్య సందర్భంగా ఆలయంలో పూలంగి సేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. శుక్రవారం రాత్రి స్వామివారికి వ్యాళి వాహనం నిర్వహించారు.

శ్రీవారి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ సిద్ధం

- సీఎం రేవంత్‌రెడ్డి
- వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు
- ముస్లింలకు ఇఫ్తార్ విందు



స్వామివారిని దర్శించుకుంటున్న సీఎం



ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి

కొడంగల్: శ్రీవారి ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందించినట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన పనులు ప్రారంభమవుతాయన్నారు. శనివారం సాయంత్రం 6గంటలకు కొండగల్‌కు చేరుకున్న ఆయన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు నందారం ప్రశాంత్, ముద్దప్ప దేశ్‌ముఖ్, ఆలయ ధర్మకర్తలు నందారం శ్రీనివాస్, మధు తదితరులు పాల్గొన్నారు.

షాదీఖానాలు మంజూరు చేయండి

నియోజకవర్గంలోని 8 మండలాలకు షాదీఖానాలు మంజూరు చేయాలని పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్ సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. శనివారం రాత్రి కొడంగల్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో సీఎం పాల్గొన్నారు. కార్యక్రమంలో నందారం ప్రశాంత్, ఎస్ఎస్‌కే సలీమ్, ఆసిఫ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు హెలిపాడ్ వద్ద కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి సీఎంకు స్వాగతం పలికారు.

అంబేడ్కర్ ఆశయాలను ప్రపంచానికి చాటాలి

అంబేడ్కర్ ఆశయాలను ప్రపంచానికి చాటాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి కొడంగల్‌లోని ఆయన నివాసంలో జై బాపు.. జై భీమ్.. జై సంవిధాన్ అభియాన్ జిల్లా సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడారని అన్నారు. మహాత్మాగాంధీని చంపిన వారిని ప్రోత్సహించేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోచమ్మతల్లి ఆలయంలో చోరీ

తుర్కయంజాల్: మున్సిపల్ పరిధిలోని పాటిగూడ పోచమ్మ ఆలయంలో గుర్తు తెలియని దుండగులు హుండీ ధ్వంసం చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి రూ.24వేల ఎత్తుకెళ్లారని చెప్పారు. ఈ మేరకు శనివారం ఆలయకమిటీ సభ్యులు ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

మట్టిని తరలిస్తున్న వాహనాలు సీజ్

మాడ్గుల: నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. సీఐ వేణుగోపాల్ రావు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని ఇర్విన్ శివారులో వాగు నుంచి శనివారం ఉదయం మట్టి తవ్వి తరలిస్తుండగా పెట్రోలింగ్ విధుల్లో ఉన్న సిబ్బంది గమనించారు. వాహనాలను ఆపి పత్రాలు పరిశీలించడంతో ఎటువంటి అనుమతులు లేవని గుర్తించారు. దీంతో నాలుగు ట్రాక్టర్లు, జేసీబీని సీజ్ చేశారు. డ్రైవర్లు, వాహన యజమానులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఇస్త్రీ దుకాణం దగ్ధం



దుకాణంలో కాలిపోయిన దుస్తులు

షాద్‌నగర్: ప్రమాదవశాత్తు ఇస్త్రీ దుకాణం దగ్ధమైన సంఘటన శుక్రవారం అర్ధరాత్రి షాద్‌నగర్‌లోని టీచర్స్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన బాసుపల్లి లింగం కొంత కాలంగా టీచర్స్ కాలనీలో దుకాణం ఏర్పాటు చేసుకుని ఇస్త్రీ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే శుక్రవారం సాయంత్రం పని ముగించుకుని ఇంటికి వెళ్లాడు. శనివారం ఉదయం వచ్చే సరికి షాపులోని దుస్తులతో పాటు ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే మంటలు వ్యాపించి ఉంటాయని స్థానికులు భావిస్తున్నారు. ప్రమాదంలో లక్ష రూపాయల నష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

కలెక్టరేట్‌లో ఎన్‌డీఆర్‌ఎఫ్ మాక్ డ్రిల్



ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాల మాక్ డ్రిల్

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రకృతి వైపరీత్యాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు, వరదలు సంభవించినప్పుడు చేపట్టబోయే సహాయక చర్యలపై జాతీయ విపత్తుల సహాయ బృందాల (ఎన్‌డీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. భవనాలు కూలిపోయినప్పుడు, కొండచరియలు విరిగిపడినప్పుడు, వినాశకరమైన వరదలు సంభవించినప్పుడు, తుపానుల వంటి విపత్తుల సమయంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ కాపాడుతుందన్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తమను తాము ఏ విధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సీసీ జనార్దన్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి గంప శ్రీనివాస్, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.



సహాయక చర్యలు

అన్నదాత.. గుండెకోత!

సాగు నీరందక గతేడాది మాదిరిగానే పంటలు ఎండిపోవడంతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. పొలాలు నెర్రలుబారి పొట్ట దశలో పంటలు చేతికందకుండా పోయాయి. దీంతో పెట్టుబడులు అందక నిండా మునిగామని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

సాగుకు నీరందక ఇబ్బందులు

- ఇంకుతున్న భూగర్భజలాలు.. ఎండిపోతున్న బోర్లు..
- నెర్రలు బారిన నేలలు
- పశుగ్రాసంగా మారుతున్న పంటలు
- ఆర్థికంగా నష్టపోతున్న అన్నదాత

చి'వరి'దశలో ఎండుతున్న పంటలు



పెద్దేముల్ మండలం బండపల్లిలో ఎండిన వరి పొలంలో గొర్రెలు మేపుతున్న రైతు రవి

తాండూరు రూరల్: పక్క ఫొటోలే కనిపిస్తున్న రైతు రవి పెద్దేముల్ మండలం బండపల్లిలో బోరు మోటరు కింద నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశాడు. కొన్ని రోజులుగా బోరు మోటర్లలో నీళ్లు తక్కువగా వస్తున్నాయి. దీంతో పూర్తిస్థాయిలో నీళ్లు అందక ఎకరంన్నర వరి పంట వట్టిపోయింది. విత్తనాల నుంచి ఎరువుల వరకు అప్పులు చేసి పెట్టిన పెట్టుబడి కన్నీరు మిగిల్చిందని రైతు వాపోతున్నాడు. పొలం గొర్రెలకు మేతగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి నీరు వదిలినా ఈ పరిస్థితి వచ్చేది కాదంటున్నాడు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ట్యాంకర్‌తో తడులు



మామిడికుంటలో ట్యాంకర్‌తో పొలం తడుపుతున్న రైతు కిషన్‌నాయక్

దౌల్తాబాద్: సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ యత్నాలు చేస్తున్నారు. ఎండిపోతున్న పంటలను చూస్తూ రైతు కన్నీరుమున్నీరవుతున్నారు. మామిడికుంట తండాకు చెందిన రైతు కిషన్‌నాయక్ తనకున్న రెండు ఎకరాలతో పాటు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని వరి సాగు చేపట్టారు. అయితే ఈ ఐదు ఎకరాల్లో నాలుగు బోర్లు ఉన్నాయి. ప్రస్తుతం భూగర్భజలాలు తగ్గడంతో బోర్లలో నీటి మట్టం తగ్గింది. దీంతో పంట కాపాడుకునేందుకు ట్యాంకర్‌తో ఇతరుల పొలాల వద్ద నుంచి నీటిని తీసుకువచ్చి పంటకు తడులు ఇస్తున్నాడు. కనీసం ఎకరం పొలం తడిచినా తినేందుకు గింజలైనా వస్తాయని ఆశతో ఎదురుచూస్తున్నాడు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆశలు ఆవిరి!



తిమ్మాయిపల్లిలో వరి పంటలో గేదెలను మేపుతున్న రైతు

దోమ: సాగు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. మండల పరిధిలోని 36 పంచాయతీల్లో సుమారు 29,870 ఎకరాల సాగుభూములున్నాయి. 19,786 మంది రైతులు బోరుబావులపైనే ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. 15 రోజుల నుంచి ఎండల తీవ్రతకు బోర్లు ఎండిపోయి పంటలకు నీరందని దుస్థితి. దీంతో చేసేదేమీ లేక ఎండిన పంటలను పశువులకు మేతగా మార్చుకుంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. ప్రభుత్వం భూగర్భ జలాలు తగ్గిన ప్రాంతాలను పరిశీలించి రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు. అప్పులు చేసి పంటలను సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలతో పంటలు ఎండిపోతున్నాయని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

అప్పు తెచ్చి సాగు

రెండెకరాల్లో వరి నాట్లు వేశా. సాగుకు రూ.30 వేల అప్పు చేశా. బోర్లలో నీరు తగ్గడంతో సాగుకు నీరందక పంట ఎండిపోతోంది. దీంతో పశువులను మేపుతున్నా. అప్పులు ఎలా తీర్చాలో పాలుపోవట్లేదు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.

– నర్సింలు, రైతు, తిమ్మాయిపల్లి

పశువులకు మేతగా పొలాలు

దుద్యాల్: ఎండల తీవ్రత కారణంగా బోరుబావులు వట్టిపోతున్నాయి. మరో వైపు విద్యుత్ కోతల కారణంగా ఆలేడ్, హస్నాబాద్, అల్లిఖాన్‌పల్లి, దుద్యాల్ తదితర గ్రామాలకు విద్యుత్ సమస్య పెరిగింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు చేసేదేమీలేక చేతికొచ్చిన పంటలు పశువుల మేపుతున్నారు. దుద్యాల్, హస్నాబాద్, ఆలేడ్, కుదురుమల్ల, ఈర్లపల్లి, లగచర్ల, హకీంపేట్, చెట్టుపల్లి తండా, చిలుముల మైల్వార్ తదితర గ్రామాల్లో పంటలకు నీరందక ఎండిపోతున్నాయి.

- కుదురుమల్లలో పెద్దెల్లి నరేశ్ మూడెకరాల్లో వరిసాగు చేపట్టగా రెండుకరాలకు నీరందక పంటను చేనులోనే వదిలేశాడు. ఇదే గ్రామానికి చెందిన పిల్లి వెంకటయ్య, సున్నపు దస్తయ్య రెండు ఎకరాల పంట వట్టిపోయింది.
- ఆలేడ్‌కు చెందిన మోత్కూరు వెంకటయ్య, కోణపాల్ల ఆంజనేయులు రెండు ఎకరాల్లో వరిసాగు చేపట్టగా ఎకరానికి కూడా నీరందక పంట వదిలేశారు. గ్రామానికి చెందిన కోణపాల్ల చంద్రప్ప మూడెకరాలు సాగు చేపట్టగా నీరందక రెండు ఎకరాల పంటల వదిలేశారు.
- హస్నాబాద్ గ్రామానికి చెందిన బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి రెండు ఎకరాల్లో వరి సాగు చేశారు. బోర్లు ఎండిపోవడంతో పంట చేనులోనే వదిలేశారు.
- కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని యాంకి గ్రామంలో రైతు కృష్ణయ్య మూడు ఎకరాల్లో వరిసాగు చేశారు. బోరులో నీరు అడుగంటి రెండు ఎకరాల పంటలో పశువులు మేపుతున్నాడు.

ఆదుకోకుంటే ఆత్మహత్యలే



పంట వేసే సమయంలో బోరులో నీరు ఎక్కువగా ఉండడంతో రెండు ఎకరాలు సాగు చేసిన. ఎండ తీవ్రతతో బోరు పోయడం లేదు. దీంతో రెండు ఎకరాల్లో పంట వదిలేశా. పంటను కోసి పశువులకు మేతగా వేస్తున్నా. పంట సాగుకు ఒక వ్యక్తి దగ్గర అప్పు తెచ్చి సాగుకు లాగోడి పెట్టిన. ఎలా కట్టాలో అర్థమవ్వట్లే. దాదాపుగా రూ.50వేల లాగోడి అయ్యింది. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలు పెరుగుతాయి.

– పిల్లి వెంకటయ్య, రైతు, కుదురుమల్ల



కుదురుమల్ల కృష్ణయ్య పొలంలో మేస్తున్న జీవాలు

పశువులకు మేతకు పంట కోస్తున్న రైతు

తగ్గిన బోరు నీళ్లు.. ఎండిన వరి పంట

యాలాల: మండల పరిధిలోని పగిడియాలకు చెందిన మహ్మద్ ఇక్బాల్ రెండు బోర్ల కింద ఐదెకరాల్లో వరిసాగు చేపట్టాడు. నీటి మట్టం తగ్గడంతో పంట ఎండుముఖం పట్టింది. రూ.1.10లక్షలు పెట్టుబడి పెట్టానని సాగుకు నీరు లేక ఏం చేయాలో తోచడం లేదని వాపోతున్నాడు. చేసేదేమీ లేక పశువులు మేపుతున్నారు. ప్రభుత్వం రైతులు ఆదుకోవాలని కన్నీరుమున్నీరవుతున్నారు.

సాగు నీరు జాడ కరువు



మోత్కూర్‌లో పశువులు మేపుతున్న రైతు

పరిగి: రైతన్న ఆశల సాగు ఆవిరి అవుతోంది. బోర్లలో నీరు లేక పంటను కాపాడుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. చివరకు చేసేదేమీ లేక పంటను పశువులకు మేతగా వేస్తున్నారు. పంటలు ఎండిపోయి అప్పుల పాలవుతున్నామని పంట నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

అప్పులే మిగిలాయి



ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని రబీలో రెండు ఎకరాల మొక్కజొన్న, అర ఎకరాలో పచ్చి మిర్చి సాగు చేశాను. బోరులో నీరు అందడం లేదు. పక్క రైతు నుంచి నీటిని కొనుగోలు చేసినా పంటను కాపాడుకోలేక పోయాను. విత్తులు గట్టిపడే దశలో మొక్కజొన్న ఎండిపోయింది. మిర్చికి కొన్ని నీటి తడులను ఇస్తున్న కాయ చిన్నగా వస్తుంది. కౌలు, పెట్టిన పెట్టుబడులు అప్పులే మిగిలాయి.

– రైతు శేఖర్, మల్లారెడ్డి గూడెం



మోమిన్‌పేట: మల్లారెడ్డి గూడెంలో ఎండిన మొక్కజొన్న

మూగజీవాల దాహార్తికి తప్పని తిప్పలు

వికారాబాద్: సాగునీరందక పంటలు ఎండుతున్నాయి. ఆరుగాలం శ్రమించిన రైతులు ఎండల తీవ్రత కారణంగా చెరువులు, కుంటలు, బోరుబావులు అడుగంటుతున్నాయి.. పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతుకు దిక్కుతోచని దుస్థితి ఎదురైంది. మూగజీవాల దాహార్తిని తీర్చడానికి సైతం ఇబ్బంది పడాల్సి వస్తోంది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది రెండు మీటర్లు ఎక్కువ లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. ఏప్రిల్ రాకుండానే పరిస్థితి ఇలా ఉంటే మే నెలాఖరు నాటికి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. దిద్దుబాటు చర్యలు చేపట్టాల్సిన అధికారులు కంటి తుడుపు చర్యలతో సరిపెడుతున్నారు. ఇంకుడు గుంతలు మచ్చుకైనా కనిపించడంలేదు. వేలల్లో ఇంకుడు గుంతలు తవ్వామని చెబుతున్న అధికారులు నిర్వహణ గాలికొది లేస్తున్నారు. చెక్ డ్యాంలు, పాంపండ్స్, చెరువులు, కుంటలు పూడిక తీయడం నామమాత్రమయ్యాయి. పర్యవేక్షించాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలున్నాయి. మరో పక్క నిబంధనలు పాటించకుండా అధికారుల అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా బోరు బావులు తవ్వుకుంటూ పోతున్నారు.

పడిపోయిన భూగర్భ జలాల వివరాలు

మండలం	నీటి మట్టం
మర్పల్లి	36 మీ.
యాలాల	32.8 మీ.
దుద్యాల్	32 మీ.
బొంరాస్‌పేట	31మీ.

అడుగంటుతున్న ప్రాజెక్టులు

2024 మార్చిలో జిల్లాలో సగటున 14 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోగా ఈ ఏడాది మార్చిలో 14.53 మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి. గతేడాది ఈ సీజన్‌లో అత్యధికంగా జిల్లాలో 33 మీటర్ల లోతుకు పడిపోగా ఈ ఏడాది 37 మీటర్ల లోతు వరకు పడిపోయాయి. తాండూరు మండలంలో అత్యధికంగా సగటున 37 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. గత ఫిబ్రవరితో పోలిస్తే ఈ నెల రెండు మీటర్ల లోతుకు జలాలు పడిపోయాయి. ఈ ప్రభావంతో జిల్లాలోని లక్నాపూర్, కోట్‌పల్లి, జుంటుపల్లి, శివసాగర్ ప్రాజెక్టుల్లో సగానికి పైగా అడుగంటాయి.



జలవనరులు కాపాడుకోవాలి



జలవనరులను కాపాడుకోవాల్సిన ప్రతీ ఒక్కరిది. ఇంకుడు గుంతలు తవ్వడంతో పాటు నిర్వహణ సక్రమంగా ఉండాలి. ఇంకుడు గుంతలు, కుంటలు, చెరువులు, చెక్ డ్యాంలలో పూడికలు తీసి నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలి. నీటిని పొదుపుగా వాడడం సామాజిక బాధ్యత. అనుమతులు లేకుండా యథేచ్ఛగా బోరుబావులు తవ్వుతున్నారు. తమకు దరఖాస్తు చేస్తే పరీక్షలు చేపట్టి రిపోర్టు ఇస్తాం. దీంతో బోర్లు వేసే వారికి నష్ట పోకుండా ఉంటారు.

– రవి శంకర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి

చెరువులో మునిగి వ్యక్తి మృతి



మృతుడి కోసం చెరువులో గాలిస్తున్న గ్రామ యువకులు

చేపల వేటకు వెళ్లి దుర్మరణం



ముట్టిపురి రాజు(ఫైల్)

దుద్యాల్: బతుకుదెరువు కోసం చెల్లీబావ వద్దకు వచ్చాడు. దొరికిన రోజు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించాడు. అనుకోకుండా చేపల వేటకు వెళ్లి, చెరువులో మునిగి మరణించాడు. ఈ ఘటన మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. కోస్గి ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొయినాబాద్ మండలం చిన్న మంగళారం గ్రామానికి చెందిన ముట్టిపురి రాజు(32) నెల రోజుల క్రితం పోలేపల్లిలో ఉండే తన చెల్లి దొబ్బలి స్వప్న ఇంటికి వచ్చాడు. ఇక్కడే ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నాడు. శనివారం పని దొరకకపోవడంతో చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి చనిపోయాడు. అక్కడే క్రికెట్ ఆడుతున్న యువకులు ఇది గమనించి చెరువులో గాలించి బయటకు తీయగా అప్పటికే మరణించాడు. ఘటన స్థలానికి చేరుకున్న కోస్గి పోలీసులు వివరాలు సేకరించారు.

పల్లెల అభివృద్ధితోనే ప్రగతి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్: పల్లెల అభివృద్ధితోనే ప్రగతి సాధ్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం మహోల్ ఎలికట్ట గ్రామంలో దేవశ్రీ పరిశ్రమ సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రజలందరూ ఆర్వో ప్లాంటును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బద్దుల మల్లయ్యయాదవ్, నారం పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి కృషి

తట్టెపల్లి పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మారెడ్డి

తాండూరు రూరల్: పెద్దేముల్ మండలం తట్టెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని సంఘం చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం పీఏసీఎస్ కార్యాలయంలో సీఈఓ రాజమౌళి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న రైతులకు రుణాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు రూ.14 కోట్ల రుణాలు ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ అంజయ్య, డైరెక్టర్లు ఉప్పరి మల్లేశం, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

జూన్ నుంచి రుణాలు

పెద్దేముల్ రైతు సేవా సహకార సంఘంలో జూన్ నుంచి రైతులకు రుణాలు అందజేస్తామని చైర్మన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. శనివారం పెద్దేముల్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు రైతులకు రూ.9 కోట్ల మేర రుణాలు ఇచ్చినట్లు తెలిపారు.

వ్యాపారంలో నష్టం

- ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆత్మహత్యాయత్నం
- పది రోజులుగా చికిత్స పొందుతూ యువకుడు మృతి

మొయినాబాద్: ఆర్థిక ఇబ్బందుల కారణంగా మానసిక వేదనకు గురైన ఓ యువకుడు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పది రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. ఈ ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సురంగల్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సురంగల్‌కు చెందిన మేలక కొమరయ్య ఏకైక సంతానం మేకల మధు(21) పండ్ల వ్యాపారి. వ్యాపారంలో నష్టం రావడంతో అప్పులు చేశాడు. అప్పు విషయం తల్లిదండ్రులకు చెప్పకుండా మనోవేదనకు గురయ్యాడు. తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు పది రోజుల క్రితం గడ్డి మందు తాగాడు. మూడు రోజుల వరకు విషయం ఎవరికీ చెప్పలేదు. మూడవ రోజు అతడు స్పృహకోల్పోయి నోటి నుంచి నురుగులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పది రోజులపాటు ఆసుపత్రిలో చికిత్స పొంది శనివారం మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తులో ఉంది.

రైలు ఢీకొని..

రైతు, రెండు కాడెడ్లు మృతి



రైతు లాలప్ప మృతదేహం



కాడెద్దు కళేబరం

తాండూరు రూరల్: కాడెడ్లను కాపాడుకునేందుకు వెళ్లిన రైతును, ఎద్దులను రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రైతు, రెండు కాడెడ్లు దుర్మరణం చెందాయి. ఈ ఘటన పెద్దేముల్ మండలం రుక్మాపూర్ సమీపంలో శనివారం చోటు చేసుకుంది. తాండూరు రైల్వే పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన ముద్దని లాలప్ప(51) ఉదయం 10 గంటల ప్రాంతంలో ఎడ్లతో పొలానికి వెళ్తున్నాడు. తాండూరు–రుక్మాపూర్ రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో ఒక్కసారిగా రైలు హారన్ వచ్చింది. ఎడ్లకు లెంక పెట్టి ఉండడంతో అవి బెదురుకుని ట్రాక్‌పై పరుగెడుతున్నాయి. వాటిని కాపాడేందుకు వెళ్లిన రైతు లాలప్పను, ఎద్దులను రైలు ఢీకొట్టడంతో రైతు, ఎద్లు మృతి చెందాయి. విషయం తెలుసుకున్న భార్య అమృతమ్మ ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.